క్లుప్తంగా

సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ శిక్షణ ఇస్తున్నారు. మహిళలు మొదట అడిష్మన్ కొరకు రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్..
సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు.

24 గంటలు వైద్యం అందించే ఆసుపత్రులు

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో :
మెడికేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ : 88852 62138
శ్రీకర ఆస్పత్రి : 040 4747 0000
ప్రణామ్ ఆస్పత్రి : 040 2304 2777
హీలెక్స్ ఆస్పత్రి : 040 4200 7070
లక్ష్మి చిల్డ్రెన్ ఆస్పత్రి : 040 2303 9733
అంకుర చిల్డ్రెన్ ఆస్పత్రి : 040 4939 9999
ఉద్భవ ఆస్పత్రి : 040 6782 0172
సిద్దార్థ ఆస్పత్రి : 79933 33301

13న హెచ్‌సీయూ స్నాతకోత్సవం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ 23వ స్నాతకోత్సవాన్ని 13వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్, గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్యరాజన్, హెచ్‌సీయూ చాన్సలర్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి పాల్గొంటారు.

16 నుంచి శబరిమల మహా పాదయాత్ర

రాయదుర్గం: దివ్యజ్యోతి శబరిమల మహా పాదయాత్రను ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు, గురుస్వాములు ముత్యంరెడ్డి, మాణిక్‌రెడ్డి మంగళవారం తెలిపారు.నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయం వద్ద ఉదయం 7 గంటలకు పాదయాత్రను ప్రారంభించి నవంబర్ 22వ తేదీన శబరిమలలో ముగించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మొత్తం 37 రోజుల పాటు సాగుతూ మొత్తం 1,134 కిలోమీటర్ల మహా పాదయాత్ర సాగుతుందని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టులో 1 గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని, అప్లై చేసుకునే అభ్యర్థులు, పీజీ కామర్స్ (పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని ,నెట్ ,పీహెచ్‌డి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో 12 వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి .దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో, 13వ తేదీ ఉదయం 10 గంటలకు ,తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష)కు హాజరు కావాలన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని పరిశీలించిన అధికారులు



విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల ప్రాథమిక పాఠశాలలను జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిలు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. బ్రేక్ ఫాస్ట్ సమయంలో అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో ఏఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నగేష్ నాయక్, ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో.. మురుగు చేరకుండా..



తెల్లాపూర్‌లోని వనం చెరువు

- చెరువుల ఆధునికీకరణకు ముందుకు వచ్చిన రియల్ ఎస్టేట్ సంస్థలు
- మరో మూడు చెరువుల అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.ఈ ప్రాంతాలు రింగ్‌రోడ్డును ఆనుకొని ఉండటంతో పాటు తెల్లాపూర్ చుట్టూ రేడియల్ రోడ్లు అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతానికి మంచి డిమాండ్. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు నివాసం ఉంటున్నారు. కొత్త కొత్త కాలనీలు రావడంతో అందుకు అనుకూలంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంది. ప్రధానంగా తెల్లాపూర్ పరిధిలోని చెరువులు పూర్తిగా డ్రైనేజీ నీటితో నిండిపోయాయి. వీటిపై గతంలో అనేక ఉద్యమాలు సైతం జరిగాయి. తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రజలు, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ ప్రజా ప్రజల సైతం చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కాగా తాజాగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6 చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. మూడు చెరువులను అభివృద్ధి చేసేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు ముందుకు వచ్చాయి. అందుకు ప్రభుత్వం సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చెరువుల అభివృద్ధికి రంగం సిద్ధమైంది. కాగా చెరువులలో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తెల్లాపూర్ పరిధిలోని చెలికుంట చెరువును అపర్ణ, మేళ్ళ చెరువును ఏలియస్, వనం చెరువును అనుహార్ హోమ్స్ దత్తత తీసుకున్నాయి. కాగా



వనం చెరువు వద్ద చెత్త తొలగింపు

వనం చెరువు వద్ద ఏపుగా పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. చెరువు శివారు ప్రాంతంలో ఎలాంటి చెత్తను, భవన శిథిలాలను వేయొద్దని హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మిగిలిన మూడు చెరువులను అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ఆ చెరువుల అభివృద్ధి కోసం రూ.13 కోట్ల నిధులను కేటాయించారు. కొల్లూరు పెద్ద చెరువు అభివృద్ధికి రూ.5 కోట్లు, ఈదుల నాగులపల్లిలోని తల్లా చెరువు అభివృద్ధికి రూ.5 కోట్లు, వెలిమెలలో సూరారం కుంట అభివృద్ధికి రూ.3 కోట్లను కేటాయించారు. దీంతో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు పర్యాటక కేంద్రాలుగా మారనున్నాయి.

చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి..



చెరువుల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది. ప్రధానంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. మూడు చెరువులను భవన నిర్మాణ సంస్థలు దత్తత తీసుకున్నాయి. చెరువులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. అందుకు సహకరించిన మంత్రులకు, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.
– మల్లెపల్లి లలితా సోమిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్

మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



చెరువుల్లోకి మురుగునీరు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చెరువులను పరిరక్షించడంలో పాలకవర్గం పూర్తిగా విఫలం చెందింది. చెరువులను అభివృద్ధి చేయడంతో పాటు చెరువు నీరు కాలుష్యం కాకుండా పాలకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. – కొల్లూరి భరత్, స్వతంత్ర కౌన్సిలర్

సమన్వయంతో అభివృద్ధి చేస్తాం



మున్సిపల్, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో చెరువులను అభివృద్ధి చేస్తాం. చెరువుకట్టపై ఏదైనా అభివృద్ధి కార్యక్రమం చేపట్టే సమయంలో మాకు కూడా సమాచారం అందించాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నాం.
– సంతోషిని, ఇరిగేషన్ ఏఈ

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో డాక్టర్ గీతా చల్లా



మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న డాక్టర్ గీతా చల్లా

గచ్చిబౌలి: మానసిక ఆరోగ్యంపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్న మనో జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతా చల్లాకు లిమ్కా బుక్ రికార్డ్స్‌లో చోటు లభించింది. 2023 లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. కోవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను నివృత్తి చేసేందుకు మానసిక ఆరోగ్యంపై 13 గంటల పాటు ఆన్‌లైన్‌లో అవగాహన నిర్వహించారు. వందకు పైగా మానసిక నిపుణులతో కలిసి 'మన పండుగలు-మానసిక ఆరోగ్యం'అనే అంశంపై అవగాహన కల్పించినందుకు భారత్ వరల్డ్ రికార్డ్ సంస్థ మరో సర్టిఫికెట్‌ను అందజేసింది. మంగళవారం కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో తెలంగాణ స్పెషల్ పోలీస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా భారత్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను డాక్టర్ గీతా చల్లాకు అందజేశారు. కార్యక్రమంలో భారత్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు దేవేందర్ బండారి, బింగి నరేందర్ గౌడ్, కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ'లో పోస్టల్ దినోత్సవం



రాయదుర్గం: పోస్టుకార్డు, లెటర్ వంటివి గుర్తు చేసుకున్న వేళ.. జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రాంగణంలో పోస్ట్ బాక్స్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎస్‌బి ప్రాంగణంలో విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఇతర అధికారులు, ఉద్యోగులు దేశ నిర్మాణానికి పోస్టల్ రంగం సహకారాన్ని గుర్తించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఐఎస్‌బీ యొక్క మౌలిక సదుపాయాలు, వృక్షజాలం, జంతు జాలం యొక్క అందం తదితరాలను వారికి ఇష్టమైన వారికి పంపించేలా ప్రత్యేకంగా రూపొందించిన పోస్ట్ కార్డులను అధ్యాపకులు, సిబ్బంది పోస్ట్ చేసి 'మెమోరీస్ ఇన్ మెయిల్' పేరిట నిర్వహించుకున్నారు.

బీజేపీ 50 రోజుల ప్రణాళిక సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం



మసీదుబండలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతియాదవ్

గచ్చిబౌలి: బీజేపీ ఆధ్వర్యంలో 50 రోజుల ప్రణాళికను సిద్ధం చేశామని బీజేపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతియాదవ్ సూచించారు. మసీదుబండలో బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎం రవికుమార్‌యాదవ్ అధ్యక్షతన మంగళవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త బూత్‌స్థాయిలో ఉండే కార్యకర్తలను ముందుగా గుర్తించాలని, వారి పేర్లు, ఫోన్ నంబర్, ఓటరు ఐడీ తీసుకోవాలని, డివిజన్ల వారీగా పార్టీ కార్యాలయాలను ప్రారంభించి అక్కడి నుంచి కార్యకలాపాలను కొనసాగించాలన్నారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ యాక్టివ్‌గా ఉండాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చి స్థానిక ఎమ్మెల్యే, అధికార పార్టీ కార్పొరేటర్ల అక్రమాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మహిళా, దళిత ,ఓబీసీ, ఎస్టీ, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

చిత్రప్రదర్శన ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం ఏర్పాటు చేసిన జోయస్ సర్క్యూట్ ఆఫ్ లైఫ్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను జెఎన్‌ఎఫ్ఏయూ వీసీ డాక్టర్ కవిత కళాకారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తున్నాయని తెలిపారు. అక్టోబర్ 26వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 52 చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.





బే విండో..విస్తరణ..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన యువ వ్యాపారద్వయం సిద్ధాంత్ ఆనంద్, శివానీ ఆనంద్‌ల ఆధ్వర్యంలో బే విండో... ఫర్నిచర్, హోమ్ డెకార్ ఉత్పత్తుల స్టోర్ గచ్చిబౌలిలో కొలువుదీరింది. మంగళవారం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ అత్యాధునిక గృహోపకరణ, ఫర్నిచర్ ఉత్పత్తులను అందిస్తున్నామని, బ్రాండ్ విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్‌లో 30వేల చదరపు అడుగుల స్టోర్ తర్వాత దీన్ని ఏర్పాటు చేశామన్నారు.

సంస్కృతికి కేరాఫ్ హైదరాబాద్

ప్రముఖ చరిత్రకారుడు అల్లం ఐజాజ్ ఫరూఖ్

రాయదుర్గం: హైదరాబాద్ సంస్కృతికి సంబంధించిన నగరమని ప్రముఖ చరిత్రకారుడు అల్లం ఐజాజ్ ఫరూఖ్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ముఖరం జా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ (సీయూసీఎస్) ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ హైదరాబాదీ సంస్కృతిని దక్కనీ భాష, కవిత్వం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతకు ముందు రెండు పుస్తకాలతోపాటు కేంద్రం ప్రచురించిన రెఫర్డ్ జర్నల్ 'అదాబ్-ఓ-సకాఫత్' తాజా సంచికను ఆవిష్కరించారు.

ఇజ్జత్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



మాదాపూర్: శేరిలింగంపల్లి ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడనున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్ వీకర్ సెక్షన్, ఖానామెట్ ప్రాతాలలో గడపగడపకు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ 50 రోజులు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేద్దామని, 60 నెలలు మీ కోసం పని చేస్తానని తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా..

ఇద్దరి నుండి 4 లక్షల 40 వేల నగదు సీజ్

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.దీంతో పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద మంగళవారం పటాన్‌చెరు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సదాశివపేటకు చెందిన రషీద్ అనే వ్యక్తి వద్ద 2.40 లక్షలు, సంగారెడ్డికి చెందిన ఇలియాస్ వద్ద రూ.2 లక్షలు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు సీఐ లాలూ నాయక్ ,ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ..డిసెంబర్ 5వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్, కార్యదర్శి ఆకాష్ మాట్లాడుతూ హెచ్‌సీయూలో అకడమిక్ విభాగంలో 5 డిమాండ్లు, మౌలిక వసతుల కల్పనలో 4 డిమాండ్లు, యూనివర్శిటీ పరిపాలనలో 6 డిమాండ్లను తీర్చి విద్యార్థులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

22న సద్దుల బతుకమ్మ .. 23న దసరా

- కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్
- పట్టణ ప్రముఖుల సమావేశంలో నిర్ణయం

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలో బతుకమ్మ పండుగను అక్టోబర్ 22న, దసరా పండుగను అక్టోబర్ 23వ తేదీన నిర్వహించుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. మంగళవారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో పండుగ తేదీలపై కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.సద్దుల బతుకమ్మను అక్టోబర్ 22వ తేదీన పట్టణంలోని సాకి చెరువు కట్టపై నిర్వహించుకోవాలని తెలిపారు. దసరా పండుగను అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ధ్వజారోహణ, జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో శమీ చెట్టుకు పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు మైత్రి మైదానంలో రావణాసుర దహనం ఉంటుందని తెలిపారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సపాన్‌దేవ్ పట్టణ ప్రముఖులు, పురోహితులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం అమలుకు శిక్షణ



ప్రొ.చంద్‌కిరణ్‌కు పూలమొక్కను అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: జాతీయ నూతన విద్యావిధానం అమలు కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్టు న్యూఢిల్లీ సంస్కృత ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్‌కిరణ్ సలూజా పేర్కొన్నారు. మంగళవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ), 'అన్‌వైలింగ్ న్యూ హరిజన్స్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్: ప్రొస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్‌కిరణ్ సలూజా మాట్లాడారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం సహకార స్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. అనంతరం సలూజాతో కలిసి వైస్‌చాన్స్‌లర్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు.

మురుగు సమస్య.. నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ ముఖద్వారం వద్ద గత కొద్దిరోజులుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వచ్చే మార్గంలో మురుగునీరు చేరడంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నెల రోజులకు పైగా రద్దీగా ఉండే ప్రధానరోడుల్లో డ్రైనేజీ నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే నరసింహ, సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణ, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, మధు, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. సర్వీస్ రోడ్డు జాప్యం

ఇక్కట్లు పడుతున్న మధురానగర్‌వాసులు

రాయదుర్గం: మోడల్ కారిడార్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సర్వీస్‌రోడ్డులో జాప్యం జరుగుతుండడం మధురానగర్‌వాసులకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది. అధికారులు ముఖ్యంగా వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపంతో పనుల్లో జాప్యం కొనసాగుతోందని మధురానగర్‌వాసులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ గ్రోత్ కారిడార్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే వెంటనే పనులకు ఉన్న అడ్డంకులు తొలగి రోడ్డు పనులు సజావుగా సాగడానికి అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. నిత్యం మధురానగర్‌వాసులు ఇళ్లకు వెళ్ళడానికి, కాలనీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు రాకపోకలకు అవస్థపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మధురానగర్‌లో జరుగుతున్న సర్వీస్ రోడ్డు పనులు